# సాక్షి
## శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 25 । జూలై । 2025






**టన్ను చీనీ రూ.17 వేలు**
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17 వేలు, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



**కిలో టమాట రూ.34**
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ. 34, కనిష్టంగా రూ.17, సరాసరిన రూ.25 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

**గరిష్టం/కనిష్టం**
**30.9°/21.4°**
జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### జైళ్లలో సదుపాయాలు సక్రమంగా ఉండాలి

- జిల్లా జడ్జి భీమరావు



పెనుకొండ: సబ్‌జైల్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా జడ్జి భీమరావు

**ధర్మవరం అర్బన్/పెనుకొండ:** సబ్ జైళ్లలో ఖైదీలకు సదుపాయాలు సక్రమంగా ఉండాలని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి భీమరావు అన్నారు. ధర్మవరం, పెనుకొండ సబ్‌జైళ్లను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదులు, ఖైదీలు ఉండే గదులు, సరుకులు నిల్వ ఉంచే గదులతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఖైదీలు నిద్రించే గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ధర్మవరం సబ్‌జైలు సూపరింటెండెంట్ శివప్రసాద్‌ను ఆదేశించారు. అనంతరం ఖైదీలో సమావేశం నిర్వహించారు. సత్ప్రవర్తనతో మెలిగితే శిక్ష తగ్గింపు కూడా ఉంటుందని తెలిపారు. ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా ఏర్పాటు చేస్తామని సూచించారు. ప్రతినెలా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఖైదీలకు పరీక్షలు నిర్వహించేలా చూడాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జిలు వెంకటేశ్వర్లు, వాసుదేవన్, జడ్జిలు బొజ్జప్ప, రాకేష్, న్యాయవాదులు బిల్లే రవీంద్ర, బాలసుందరి, సుమలత, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

### 22 మండలాల్లో వర్షం



పెడపల్లిలో కురుస్తున్న వర్షం

**పుట్టపర్తి అర్బన్:** తుపాను ప్రభావంతో జిల్లాలోని 22 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ జిల్లాలోని బుక్కపట్నం మండలంలో 8.2 మి.మీటర్లు, అమరాపురంలో 6.2 , సోమందేపల్లిలో 5.8, పెనుకొండలో 5.6 , చిలమత్తూరులో 5.6 , హిందూపురంలో 4.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. అలాగే రొద్దంలో 4.4 మి.మీటర్లు, ఓడీ చెరువులో 4.2, నల్లచెరువులో 4.2, లేపాక్షిలో 4.2, గుడిబండలో 3.8, మడకశిరలో 3.6, పుట్టపర్తిలో 3.4, కొత్తచెరువులో 3.2, కదిరిలో 2.8, గాండ్లపెంటలో 2.4, రొళ్లలో 2.4, సీకేపల్లిలో 2.2, అమడగూరులో 2.2, గోరంట్లలో 2.2, తలుపులలో 1.6, ఎన్‌పీ కుంటలో 1.2 మి.మీటర్ల వర్షం కురిసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 22 మండలాల్లో మొత్తం 84.2 మి.మీటర్ల వర్షం పడినట్లే తెలియజేశారు. అల్పపీడన ప్రభావం కొనసాగుతోందని మరికొన్ని రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

### గొట్లూరు సర్పంచ్‌కు అరుదైన అవకాశం

- స్వాతంత్య్ర వేడుకలకు ఆహ్వానం



పిట్టా నరసమ్మ

**ధర్మవరం రూరల్:** మండలంలోని గొట్లూరు సర్పంచ్ పిట్టా నరసమ్మకు అరుదైన అవకాశం దక్కింది. దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు కేంద్రం నుంచి ఆహ్వానం అందింది. ఈమేరకు గురువారం ఎంపీడీఓ సాయి మనోహర్ ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తమ పంచాయతీల జాబితాలో గొట్లూరు పంచాయతీ ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు పంచాయతీలు ఎంపిక కాగా అందులో గొట్లూరు పంచాయతీ కూడా ఉందన్నారు.

### మాజీ సర్పంచ్‌పై సైబర్ వల

**బొమ్మనహాళ్:** మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ మాజీ సర్పంచ్ మారుతీప్రసాద్‌పై సైబర్ నేరగాళ్లు వల విసిరారు. అయితే ఆయన తెలివిగా వ్యవహరించడంతో వల నుంచి తప్పించుకున్నారు. గతేడాది ఫోన్ కాల్ చేసి రూ.25 వేలు దోచుకున్న విషయం మరువకనే తాజాగా గురువారం 99915 17668 నంబరు నుంచి కాల్ వచ్చింది. 'మీ అమ్మకు సంబంధించిన పెన్షన్ వచ్చింది. బ్యాంకు లింక్ లేదు. మీ అకౌంట్‌కు వేస్తాం. మీ అకౌంట్ నంబరు చెప్పండి' అని అవతలి వ్యక్తి అడిగాడు. దీంతో నంబర్ చెప్పిన తర్వాత నగదు బదిలీ కావడం లేదని, ఫోన్ పే నంబర్‌కు వేస్తాం ఫోన్ పే యాప్ ఓపెన్ చేయాలని సూచించాడు. దీంతో మారుతీప్రసాద్‌కు అనుమానం వచ్చి మందలించి ఫోన్ కట్ చేశాడు. అనంతరం విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు పరిశీలించి అది సైబర్ నేరగాళ్ల పనిగా నిర్ధారించారు.



# రెడ్ సిగ్నల్!



మడకశిర వద్ద రైల్వేలైన్ పనులు ఆగిపోయిన దృశ్యం

రాయదుర్గం – తుమకూరు రైల్వే పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిర్దేశించిన గడువు ముంచుకొస్తున్నా చాలా చోట్ల అసలు పనులే ప్రారంభంకాలేదు. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టిసారించకపోవడంతో పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో కూటమి నాయకులు కూడా విఫలం కావడంతో ఆయా ప్రాంతాల ప్రజలు పెదవి విరుస్తున్నారు.

- రాయదుర్గం– తుమకూరు రైల్వేలైన్ నిర్మాణంలో తీవ్ర జాప్యం
- 206 కి.మీలకు గాను కేవలం 86 కి.మీటర్లే పూర్తి
- 14 ఏళ్లుగా సా...గుతున్న పనులు
- గడువు ముంచుకొస్తున్నా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

| రాయదుర్గం - తుమకూరు రైల్వేలైన్ వివరాలు ఇలా.. | |
|---|---|
| రైల్వేలైన్ పొడవు | 206.53 కి.మీ |
| రైల్వేలైన్‌కు శంకుస్థాపన చేసింది | అక్టోబర్ 2011 |
| పూర్తి చేయడానికి నిర్దేశించిన సంవత్సరం | 2026 |
| రైల్వేలైన్ మార్గం | రాయదుర్గం, కళ్యాణదుర్గం, పావగడ, మడకశిర, మధుగిరి, కొరటగెరె, తుమకూరు |
| ప్రస్తుతం పూర్తయిన రైల్వేలైన్ | 83 కిలోమీటర్లు |

**మడకశిర:** ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సరిహద్దు నియోజకవర్గాల ప్రజలకు రాయదుర్గం - తుమకూరు రైల్వేలైన్ ఎంతో ఉపయోగకరం ఉంటుంది. ఇది పూర్తయితే సరిహద్దులో ఆంధ్ర-కర్ణాటక మధ్య రవాణా సౌకర్యం పూర్తిగా మెరుగుపడుతుంది. అలాగే సరిహద్దు నియోజకవర్గాల రైతులు ఉత్పత్తి చేసే వ్యవసాయోత్పత్తులను తుమకూరు, బెంగళూరు మార్కెట్లకు తరలించి గిట్టుబాటు ధరకు అమ్ముకోవడానికి సులభంగా ఉంటుంది. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ రైల్వేలైన్ నిర్మాణాన్ని పూర్తిచేయడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది.

**యూపీఏ ప్రభుత్వ హయాంలో..**

రాయదుర్గం-తుమకూరు రైల్వేలైన్ నిర్మాణానికి 2011 అక్టోబర్‌లో శంకుస్థాపన చేశారు. అప్పట్లో కేంద్రంలో అధికారంలో యూపీఏ ప్రభుత్వం ఈ రైల్వేలైన్‌ను మంజూరు చేసింది. ఇది పూర్తయితే కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరు నుంచి బెంగళూరు, ఇతర ముఖ్య పట్టణాలతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సరిహద్దు నియోజకవర్గాలకు అనుసంధానం ఏర్పడి రవాణా సౌకర్యం మరింత మెరుగవుతుందనే ఉద్దేశంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం రైల్వేలైన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

**కేవలం 83 కిలో మీటర్లే పూర్తి..**

రైల్వేలైన్ మంజూరై దాదాపు 14 ఏళ్లు కావస్తోంది. మొత్తం 206.53 కిలోమీటర్ల రైల్వేలైన్‌లో ఇంత వరకూ కేవలం 83 కిలోమీటర్ల రైల్వేలైన్ మాత్రమే పూర్తయింది. మిగిలిన 123.53 కిలోమీటర్ల రైల్వేలైన్ పూర్తి కావాల్సి ఉంది. ఇందులో కూడా పావగడ, మడకశిర, తుమకూరు నియోజకవర్గాల్లో 49 కిలోమీటర్ల రైల్వేలైన్ పనులు మాత్రమే జరుగుతున్నాయి. ఈ పనులు కూడా నత్తనడకన జరుగుతున్నాయి. అసలు 79.53 కిలోమీటర్ల రైల్వేలైన్ పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ఈరైల్వేలైన్‌లో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కదిరేదేవరపల్లి వరకు మాత్రమే ఒక రైలు నడుస్తోంది. అలాగే కదిరిదేవరపల్లి నుండి పావగడ నియోజకవర్గంలోని దొడ్డహళ్లి వరకు రైల్వేలైన్ నిర్మాణం పూర్తయింది. రైల్వే అధికారులు రైలును ట్రయల్ రన్ కూడా పూర్తి చేసిన విషయం తెలిసిందే.

**వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ**

మడకశిర నియోజకవర్గంలో రైల్వేలైన్ నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పూర్తిస్థాయిలో సహకారం అందించారు. భూసేకరణలో జాప్యం జరగకుండా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మడకశిర ప్రాంతంలో రైల్వేలైన్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చేసి సకాలంలో రైల్వేశాఖకు అప్పగించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుంది. భూములిచ్చిన రైతులకు జాప్యం చేయకుండా నష్టపరిహారం అందించారు. ఈ నేపథ్యంలోనే రైల్వేలైన్ నిర్మాణానికి అవకాశం ఏర్పడింది.

**గడువులోపు కష్టమే..**

కర్ణాటక రాష్ట్రంలోని మధుగిరి, కొరటగెరె నియోజకవర్గాల్లో ఈరైల్వేలైన్ పనులు ఇంత వరకు ప్రారంభం కాలేదు. మధుగిరి నియోజకవర్గానికి ఆరాష్ట్ర సహకారశాఖ మంత్రి రాజన్న, కొరటగెరె నియోజకవర్గానికి ఆ రాష్ట్ర హోం మంత్రి పరమేశ్వర్ ప్రాతినిథ్యం వహిస్తున్నా ఆ నియోజకవర్గాల్లో రైల్వేలైన్ పనులు ప్రారంభం కాకపోవడం గమనార్హం. రైల్వేలైన్ నిర్మాణానికి అవసరమైన భూమిని సమయానికి సేకరించి రైల్వేశాఖకు అప్పగించడంలో కర్ణాటక ప్రభుత్వం విఫలం కావడంతో ఈపరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఈ నియోజకవర్గాల్లో కూడా భూసేకరణ పూర్తయింది. ఈ రైల్వేలైన్ నిర్మాణం 2026లోగా పూర్తి చేయాల్సి ఉంది. కొన్ని చోట్ల ప్రారంభం కాకపోవడంతో గడువులోపు పూర్తి కావడం కష్టమేనని రైల్వే అధికారులే చెబుతున్నారు.

**కేంద్ర మంత్రి హామీ ఇచ్చినా..**

మడకశిర నియోజకవర్గానికి ఆనుకునే కర్ణాటక రాష్ట్రానికి చెందిన తుమకూరు లోకసభ నియోజకవర్గం నుంచే కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఏడాది క్రితమే రైల్వేశాఖమంత్రి సోమన్న మడకశిరలో పర్యటించి రైల్వేలైన్ పనులను పరిశీలించారు. రెండేళ్లలోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆయన పర్యటించి ఏడాది గడుస్తున్నా మడకశిర వద్ద రైల్వేలైన్ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు.

### పనులు పూర్తి చేయాలి



మడకశిర ప్రాంతం ప్రజలకు రైల్వేసేవలందించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జాప్యం జరగకుండా రైల్వేలైన్ నిర్మాణానికి భూసేకరణ పూర్తి చేసి ఇవ్వడం ఎంతో గొప్ప విషయం. కేంద్ర రైల్వేశాఖ మంత్రి మడకశిరకు వచ్చి పోయినా ఫలితం లేదు. కూటమి నాయకులు బిల్డప్ ఇవ్వడాన్ని మానుకుని రైల్వేలైన్ నిర్మాణంపై శ్రద్ధ చూపాలి.
– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

### ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి



రైల్వేలైన్ నిర్మాణంపై ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. ఈ రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే సరిహద్దు నియోజకవర్గాల రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఈ ప్రాంతం రైతులు తమ వ్యవసాయోత్పత్తులను తుమకూరు, బెంగళూరు తదితర మార్కెట్లకు తరలించి గిట్టుబాటు ధరకు అమ్ముకోవచ్చు.
– ఆనందరంగారెడ్డి, రైతు సంఘం నాయకుడు,

### ప్రజల కల నెరవేర్చండి



రాయదుర్గం–తుమకూరు రైల్వేలైన్ నిర్మాణంతో అంతర్ రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. ప్రధానంగా బెంగళూరు, బళ్లారి వెళ్లేందుకు సరిహద్దు నియోజకవర్గ ప్రజలకు సులభమవుతుంది. మడకశిర ప్రజలు రైల్వే సేవలు పొందే కల కూడా నెరవేరుతుంది. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా రైల్వేలైన్ పనులు పూర్తి అయ్యే విధంగా చూడాలి. – అశ్వత్థనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, మడకశిర

# హామీలపై కూటమిని నిలదీయండి



'మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి ఉషశ్రీ చరణ్

- సుపరిపాలన పేరుతో టీడీపీ దుష్ప్రచారం
- బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ప్రగల్భాలకే పరిమితం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

**పరిగి:** 'ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా సుపరిపాలన పేరుతో కూటమి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారు. ఎక్కడికక్కడ వారిని నిలదీయండి' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. పరిగి మండలంలో గురువారం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా విట్టాపల్లి, పీ నరసాపురం , కొడిగెనహల్లి మేజర్ పంచాయతీ బిందూనగర్, మోదా గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టిందేమీలేదని, కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని విమర్శించారు.

**యువతకు ఉపాధి ఎక్కడా?**

ఈ ప్రాంతంలోని ప్రీకాట్ మెరీడియన్ స్పిన్నింగ్ మిల్లు మూత పడిందన్నారు. అధికారంలోకి వస్తే ఉపాధి అవకాశాలను మెరుగు పరిచి, చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధిని కల్పిస్తామని నమ్మబలికించి ఇలా ఉన్న ఉద్యోగాలను ఊడగొడట్టేందుకే మీకు అవకాశమిచ్చారా అంటూ మంత్రి సవితపై ధ్వజమెత్తారు. బీసీ సంక్షేమశాఖ మంత్రిగా ఉంటూ కనీసం బీసీలకు ఏమాత్రం న్యాయం చేశారో మంత్రి సవిత ఆత్మ విమర్శ చేసుకోవాన్నారు.

**దళిత బాలికకు ఏం న్యాయం చేశారు?**

రాష్ట్రాన్ని కుదిపేసిన ఏడు గుర్రాలపల్లిలో ఓ దళిత బాలికపై జరిగిన అత్యాచార ఘటనపై హోం మంత్రి అనిత స్పందించకపోవడం దారుణమన్నారు. ఇటీవల ఆమె మడకశిరలో పర్యటించినప్పటికీ రాప్తాడు నియోజకవర్గంలో జరిగిన సంఘటనపై స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ కూటమి ప్రభుత్వం చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడుతోందని విమర్శించారు. కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడానికి మాత్రమే మంత్రులు పని చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బెదిరింపులకు భయపడే వారెవరూ వైఎస్సార్‌సీపీలో లేరని.. తప్పు చేసింటే నేడు ప్రజలతో ఇలా మమేకమయ్యే పరిస్థితి ఉండేది కాదన్నారు. నిత్యం అబద్ధాలతో కూటమి నాయకుల చేస్తున్న వాగ్దానాలను నమ్మవద్దని హితవుపలికారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఏడు గుర్రాలపల్లి బాధితురాలికి న్యాయం చేస్తాం



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

**పుట్టపర్తి అర్బన్:** రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన రామగిరి మండలం ఏడు గుర్రాలపల్లి బాలికకు న్యాయం జరిగేలా చూస్తానని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి సాయి ఆరామంలో జరిగిన మహిళల సంక్షేమం, భద్రత, హక్కులపై జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమానికి ఆమె అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఏడు గుర్రాలపల్లి సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు. బాలిక కుటుంబానికి ఆర్థికంగా సామాజికంగా అండగా ఉంటామన్నారు. బాలిక ఎంత వరకూ చదివితే అంత వరకూ చదివిస్తామన్నారు. పోక్సో చట్టం కింద వచ్చే పరిహారం అందజేస్తామన్నారు. అఘాయిత్యానికి పాల్పడిన 17 మంది నిందితులకు శిక్ష పడేలా చూస్తామన్నారు. ఆడ బిడ్డలు ఇబ్బంది పడకుండా ఉండాలన్నా, సమస్యలు పరిష్కరించుకోవాలన్నా విద్య చాలా ముఖ్యమని పేర్కొన్నారు. చట్టాలపై మహిళందరికీ అవగాహన అవసరమని చెప్పారు. తమ దృష్టికి వచ్చే కొన్ని కేసులను సుమోటాగా తీసుకొని విచారిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో 500 శక్తి టీంలు ఏర్పాటు చేశామని , 900 హాట్‌స్పాట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. సమావేశం ఎస్పీ రత్న, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

# పనులపై పూర్తి సమాచారమివ్వండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

- కలెక్టర్ టీఎస్ చేతన్

**ప్రశాంతి నిలయం:** గ్రామీణాభివృద్ధి పనులపై జాతీయ కేంద్ర బృందం ఎనిమిది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టనుందని, ఈ నేపథ్యంలో ఆయా శాఖల పరిధిలో అమలు చేస్తున్న కార్యక్రమాలపై పూర్తి సమాచారం కేంద్ర బృందానికి సమర్పించాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్వహిస్తున్న గ్రామీణాభివృద్ధి పథకం అమలుపై జాతీయ కేంద్ర బృందం సభ్యులు దయాకర్‌రెడ్డి, చూడామణి రెడ్డితో కలసి కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులతో సమీక్షా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకూ అమరాపురం, గాండ్లపెంట, రామగిరి మూడు మండలాల్లో 8 గ్రామ పంచాయతీల్లో కేంద్ర బృందం పర్యటిస్తుందన్నారు. వివిధ అంశాలపై ఈ బృందం దృష్టిసారించనుందన్నారు.

### ప్రభుత్వ సేవలు అందేలా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 పథకం విజయవంతం అయ్యేలా అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో పీ4, బంగారు కుటుంబాల దత్తత, మార్గదర్శి, గ్రామ సభలు, ప్రభుత్వ పథకాలు సేవల ప్రజా స్పందన తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలసి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ చేతన్ మాట్లాడారు. పీ4పై జిల్లా అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. ప్రభుత్వ సేవలు సంతృప్తి కరస్థాయిలో అందేలా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలన్నారు.

# ఏసీబీ వలలో దుర్గం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్



ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామి

**అనంతపురం/కళ్యాణదుర్గం:** కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ నారాయణ స్వామి ఏసీబీ వలకు చిక్కారు. గురువారం రాత్రి అనంతపురం నగరంలోని రామ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ పట్టుబట్టారు. కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ఉన్న నారాయణస్వామికి ఇటీవల ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించారు. కొన్ని రోజుల క్రితం కళ్యాణదుర్గం మండలం నుసికొట్టాల గ్రామానికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి నాగేంద్ర నాయక్ కళ్యాణదుర్గంలో 1.5 ఎకరాలకు సంబంధించి రిజిస్ట్రేషన్, ల్యాండ్ కన్వర్షన్ నిమిత్తం కార్యాలయానికి వెళ్లగా రూ.7 లక్షలు ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్ డిమాండ్ చేశారు. చివరకు రూ.5 లక్షలకు ఒప్పుకున్నారు. ఈ క్రమంలోనే నాగేంద్రనాయక్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. గురువారం రాత్రి డబ్బు ముట్టజెప్పేందుకు అనంత పురం రామ్ నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు రావాలని కోరాడు. నారాయణస్వామి డబ్బు తీసుకుంటుండగా, అప్పటికే కాపుకాసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రూ.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. డాక్యుమెంటేషన్ పరిశీలనకు కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకెళ్లారు.

**చర్చనీయాంశం..**

కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నారాయణ స్వామిని అటు కార్యాలయంలోనూ, ఇటు అధికార టీడీపీలోని ఓ వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. అధికార టీడీపీలో కేవలం ఒక వర్గానికి మాత్రమే అనుకూలంగా ఉంటున్నారన్న కారణంతో పలుమార్లు నారాయణ స్వామిపై టీడీపీలోని మరో వర్గం జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసింది. ఇటీవల రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన ఈ-స్టాంప్ కుంభకోణంలో సైతం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి పాత్ర ఉన్నట్లు టీడీపీలోని ఓ వర్గం ఆరోపించింది. కంబదూరు, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం మండలాల తహసీల్దార్ల సంతకాల ఫోర్జరీ, భూ బదలాయింపుపై కూడా ఆరోపణలు వినిపించాయి. అలాగే, జిల్లాకు చెందిన కీలక మంత్రి భూమి విషయంలో నారాయణస్వామిపై కన్నెర్ర చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయన ఏసీబీ వలలో పడడం చర్చనీయాంశమైంది.



అలంకరణలో ముదిరెడ్డిపల్లి చౌడేశ్వరీదేవి



అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు ఊరేగింపుగా వస్తున్న మహిళలు

### కరుణించు చౌడేశ్వరీ..

**హిందూపురం:** చౌడేశ్వరీదేవి జయంతి సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాల్లో ఉత్సవాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూపురం పరిధిలోని ముదిరెడ్డిపల్లి, కొటిపి, కంసాలపేట అమ్మవారి ఆలయాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. భక్తిశ్రద్ధలతో మహిళలు పెద్ద ఎత్తున అమ్మవార్లకు బోనాలను సమర్పించారు.

# మోగనున్న బాజాభజంత్రీలు



- నేటి నుంచి శ్రావణమాసం ఆరంభం
- నవంబర్ దాటితే మళ్లీ 2026 ఫిబ్రవరిలోనే ముహూర్తాలు

**కదిరి:** వివాహాది శుభ కార్యాలకు నెలవైన శ్రావణ మాసం వచ్చేసింది. ఈ మాసంలో ఫంక్షన్ హాళ్లు, వస్త్ర, బంగారు దుకాణాలు కిటకిటలాడనున్నాయి. నెలన్నర రోజులుగా గురు మూఢంతో శుభకార్యాలు లేవు. గురువారంతో ఆషాడమాసం ముగిసింది. శుక్రవారం (నేటి) నుంచి శ్రావణమాసం మొదలవుతోంది. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకూ దివ్యమైన ముహూర్తాలున్నాయని పురోహితులు చెబుతున్నారు. ఇవి దాటితే మళ్లీ కార్తీక మాసంలోనే వివాహాలకు మంచి ఘడియలని అంటున్నారు. వివాహాలకు మాత్రమే కాదు..కొత్త వ్యాపారాలు ప్రారంభించడానికి, గృహ ప్రవేశాలకు, పూజలు, నోములు, వ్రతాలకు కూడా అనువైన ముహూర్తాలు ఎన్నో ఉన్నాయి.

### శుభ ముహూర్తాలు ఇవే..

ఈ నెలలో 26, 27, 30, 31 తేదీలు, ఆగస్టులో 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. ఇక ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 21 వరకూ భాద్రపద మాసం ఉంటుంది. ఇది శూన్య మాసం అయినందున శుభ ముహూర్తాలు ఉండవు. ఆ తర్వాత మళ్లీ సెప్టెంబర్ 23, 24, 26, 27, 28వ తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. అక్టోబర్ 1, 2, 3, 4, 8, 10, 11, 12, 22, 24, 29, 30వ తేదీలు కూడా శుభ ఘడియలే. నవంబర్‌లో 1, 2, 7, 8, 12, 13, 15, 22, 23, 26, 27, 29, 30 తేదీల్లో సైతం వివాహాలు జరిపించడానికి మంచి ముహూర్తాలున్నాయని పండితులు సూచిస్తున్నారు. ఆ తర్వాత డిసెంబర్ 8 నుంచి ఫిబ్రవరి 6 వరకూ శుభ ముహూర్తాలు లేవు.

### ఫంక్షన్ హాళ్లకు డిమాండ్..

పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో జిల్లాలోని అన్ని ప్రధాన పట్టణాల్లో ఉన్న ఫంక్షన్ హాళ్లకు డిమాండ్ నెలకొంది. వాహనాల పార్కింగ్, విశ్రాంతి గదులతో పాటు అన్ని రకాల వసతులున్న ఫంక్షన్ హాళ్లకు డిమాండ్ ఎక్కువ. ఇది వరకే పెళ్లి సంబంధాలు కుదుర్చున్న వారు శ్రావణ, కార్తీక మాసాల్లోని శుభ ముహూర్తాల తేదీలు పురోహితుల ద్వారా ముందే తెలుసుకుని ఫంక్షన్ హాళ్లను ముందే బుక్ చేసుకున్నారు.

### శ్రావణమంటేనే శుభప్రదం



ఒక్క భాద్రపద మాసం మినహాయిస్తే శ్రావణం మొదలు నవంబర్ వరకూ బలమైన ముహూర్తాలున్నాయి. మళ్లీ డిసెంబర్ 8 నుంచి ఫిబ్రవరి 6 వరకూ ముహూర్తాలు లేవు. గత రెండు నెలలుగా శుభకార్యాలు లేక వ్యాపారులే కాదు.. పురోహితులు కూడా ఇబ్బంది పడ్డారు.

– నరసింహాచార్యులు, ప్రధాన అర్చకులు, ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం

### డిమాండ్ పెరిగింది



రెండు నెలలుగా పెళ్లిళ్లు లేక ఫంక్షన్ హాళ్లను ఖాళీగా పెట్టుకున్నాం. ఈ సీజన్‌ను దృష్టిలో పెట్టుకు కొందరు ముందే బుక్ చేసుకున్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో కూడా రికార్డు స్థాయిలో ముహూర్తాలున్నాయని కొందరు ఫంక్షన్ హాళ్లను ముందే బుక్ చేసుకుంటున్నారు.

– టీవీ శివారెడ్డి, దత్త ఫంక్షన్ హాల్, కదిరి

## క్లుప్తంగా

### ఎంపీఈఓల సర్దుబాటుపై కసరత్తు



ఎంపీఈఓల సర్దుబాటు ప్రక్రియను పరిశీలిస్తున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

**అనంతపురం అగ్రికల్చర్:** ఉమ్మడి జిల్లా పరిధిలో పనిచేస్తున్న 189 ఎంపీఈఓలను సర్దుబాటు చేయడానికి వ్యవసాయశాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. గురువారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ సమక్షంలో ఏడీఏలు, టెక్నికల్ ఏఓలు, సూపరింటెండెంట్లు హాజరై రేషనలైజేషన్ ఆధారంగా... ఇటీవల వీఏఏలు, వీహెచ్‌ఏలు, వీఎస్ఏల బదిలీలను దృష్టిలో ఉంచుకుని ఎంపీఈఓలను నియమించేందుకు చర్యలు చేపట్టారు. ఏడీఏల ప్రతిపాదనలను పరిగణలోకి ఖాళీగా ఉన్న ఆర్‌ఎస్‌కేలకు కొందరిని, పంటల విస్తీర్ణం అధికంగా ఉన్న ప్రాంతాలకు మరికొందరిని సర్దుబాటు చేయనున్నారు. సమావేశంలో ఏడీఏలు అల్తాఫ్‌అలీఖాన్, వెంకటరాముడు, సత్యనారాయణ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

### ఆదాయ పన్ను చెల్లింపుతోనే దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం



మాట్లాడుతున్న ఆదాయ పన్ను శాఖ అధికారి

**చిలమత్తూరు:** ఆదాయం పొందే ప్రతి ఒక్కరూ పన్ను చెల్లించినప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని ఆదాయపు పన్ను శాఖ అధికారులు పి.రవి, శరత్‌కుమార్, లక్ష్మీకాంత్ పేర్కొన్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్ డేను పురస్కరించుకుని ఆదాయపు పన్ను చెల్లింపులపై ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో హిందూపురంలోని వివేకానంద మిలీనియం పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. పౌరులు ఆదాయపు పన్ను చెల్లింపు అంశంలో బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఈ విషయంగా తల్లిదండ్రులను చైతన్య పరచాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హరీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రీసర్వేతో భూములు గుర్తించడం సులభం



హిందూపురం: భూములు పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

**హిందూపురం:** భూమి సర్వే నంబర్లు గుర్తించాడన్ని హక్కుదారులకు సులభతరం చేయడానికే ప్రభుత్వం రీసర్వే చేస్తోందని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. గురువారం హిందూపురం మండలంలోని తూమకుంట పంచాయతీ పరిసరాల్లో భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అడంగళ్ ఆధారంగా సర్వేనంబర్లు భూమి విస్తీర్ణం వంటి వివరాలను రెవెన్యూఅధికారులు, రికార్డులను పరిశీలించారు.

**లేపాక్షి:** లేపాక్షి పంచాయతీలో జరుగుతున్న భూ రీసర్వేను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఎంతమేరకు సర్వే నిర్వహించారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది బదిలీపై వెళ్లడంతో కొత్త టీంను పెనుకొండ, హిందూపురం మండలాల నుండి నియమించి రీసర్వేను వేగవంతం చేయాలని తెలిపారు.

**రాజకీయ పార్టీలతో సమావేశం..**

**హిందూపురం:** ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, సమర్థత, ప్రజల నైతిక భాగస్వామ్యం పెంపొందించడమే లక్ష్యంగా ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తోందని ఎలెక్షన్ రిజిస్ట్రేషన్ అధికారి, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయపార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కొత్తగా ఏర్పాటు చేయాల్సిన పోలింగ్ స్టేషన్లు, బూత్ రేషనలైజేషన్, తదితర వాటిపై చర్చించారు. ఫారమ్ 6 ద్వారా 18 ఏళ్లు పూర్తి చేసుకున్న వారు ఓటుహక్కు నమోదు చేసుకోవచ్చునన్నారు. పార్టీల ప్రతినిధులు తమ ప్రాంతాల్లో పౌరులకు అవగాహన కల్పించి ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం పొందేలా కృషిచేయాలని సూచించారు.కార్యక్రమములో తహసీల్దార్లు వెంకటేష్, సౌజన్యలక్ష్మి, నటరాజ్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్, ఆర్ఐ అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మండల సర్వేయర్‌పై పచ్చ దౌర్జన్యం



సర్వేయర్ జోసఫ్‌తో వాదులాడుతున్న టీడీపీ నాయకులు

**బత్తలపల్లి:** అధికారంలో ఉన్నాం కాబట్టి అందరూ తమ మాటే వినాలనే ధోరణితో మండల సర్వేయర్‌పై టీడీపీ నాయకులు దౌర్జన్యానికి తెరలేపారు. మాట వినకపోతే నానా దుర్భాషాలు ఆడుతూ రెచ్చిపోయారు. గురువారం బత్తలపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో, తహసీల్దార్ స్వర్ణలత సమక్షంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. మాల్యవంతం పంచాయతీ పరిధిలోని ఎం.చెర్లోపల్లికి చెందిన టీడీపీ సానుభూతిపరులు రేవతి, గంగాదేవి, లక్ష్మీదేవి, నారాయణమ్మ, ఓబులేసు, నిర్మలమ్మకు 2002లో సర్వే నంబర్ 31–6 లో డీ పట్టాలను అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. అయితే ఆ భూములు సాగు చేయకుండా బీడుగా ఉంచుకోవడంతో అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు చిన్న వెంకటరెడ్డి, పెద్ద వెంకటరెడ్డి గత ఆరేళ్లుగా చీనీ చెట్లు సాగు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ భూమిలో సాగులో ఉన్న తమ పేరున పట్టాలు ఇవ్వాలంటూ చిన్న వెంకటరెడ్డి, పెద్ద వెంకటరెడ్డి ఇటీవల స్పందన కార్యక్రమంలో అర్జీ ఇచ్చారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వేయర్ జోసఫ్ ఆ గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. రైతులకు డి.పట్టా ఉందని, పట్టాదారు పాసుపుస్తకం ఉందని అయితే భూమి సాగులో లేరని, పెద్ద వెంకటరెడ్డి, చిన్న వెంకటరెడ్డి ఇరువురి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోయినా వారు ఆ భూమిలో సాగులో ఉన్నట్లు నివేదికను తహసీల్దార్‌కు అందజేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయం చేరుకుని నిలదీశారు. ఆ భూమిపై తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, ఈలోపు మీరేందుకు సర్వే చేశారంటూ మండిపడ్డారు. తహసీల్దార్ ఎంత సర్ది చెప్పబోయినా వినలేదు. పరిస్థితి అదుపు తప్పి దాడికి తెగబడే అవకాశముండడంతో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని టీడీపీ నాయకులు, రైతులకు సర్దిచెప్పారు. అనంతరం టీడీపీ నేతలు, మండల సర్వేయర్ వాదనలను తహసీల్దార్ స్వర్ణలత విని సమస్య పరిష్కారానికి శుక్రవారం గ్రామానికి రానున్నట్లు తెలిపారు. రైతులు నష్టపోకుండా న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

## వెంటాడిన మృత్యువు



దెబ్బతిన్న పంచర్ షాపు (ఇన్‌సెట్) ఫకృద్దీన్ (ఫైల్)

**పెనుకొండ రూరల్:** బతుకు తెరువు కోసం కర్ణాటక నుంచి వలస వచ్చిన వ్యక్తిని ప్రమాదం రూపంలో వెంటాడి మృత్యువు కబళించింది. స్థానికులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని బళ్లారికి చెందిన ఫకృద్దీన్ (36), ఫర్హానా దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మూడేళ్ల క్రితం బతుకు తెరువు కోసం పెనుకొండకు వలస వచ్చాడు. పంచర్ షాపును నిర్వహిస్తు కుటుంబాన్ని పోషించుకొనేవాడు. ఈ క్రమంలో రెండు వారాల క్రితం దుద్దేబండ మలుపు సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన పంచర్ షాపును ఏర్పాటు చేసుకున్నాడు. రోజు లాగే గురువారం పంచర్ షాపును తెరిచి తన పనిలో నిమగ్నమైన సమయంలో ఊహించని రీతిలో మృత్యువు వెంటాడింది. బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళుతున్న లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొని నేరుగా పంచర్ షాపు వైపుగా దూసుకెళ్లింది. షాపు ముందు పని చేసుకుంటున్న ఫకృద్దీన్‌పై బోల్తాపడింది. ఘటనలో ఫకృద్దీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన కుమారుడు ముస్తాక్ త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. సమాచారం అందుకున్న కియా పీఎస్ ఎస్ఐ రాజేష్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

### నీటి కుంటలో పడి వృద్ధురాలి మృతి



గంగమ్మ (ఫైల్)

**పరిగి:** మండలంలోని శీగిపల్లికి చెందిన గంగమ్మ(74) నీటి కుంటలో పడి మృతి చెందింది. కుమారుడు హనుమంతరాయప్ప కుటుంబంతో కలిసి నివాసముంటున్న ఆమె గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన సమీపంలో ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడిపోయింది. గ్రామస్తుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. హనుమంతరాయప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### వ్యక్తి ఆత్మహత్య

**ధర్మవరం:** స్థానిక మారుతీనగర్‌కు చెందిన మంచిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి(45) గురువారం సాయంత్రం పోతుకుంట వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లమాడ పంచాయతీరాజ్ కార్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతి కింద కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయనకు భార్య మాధవి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై హిందూపురం రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### విద్యార్థి అదృశ్యం



ప్రశాంత్ కుమార్

**కొత్తచెరువు:** మండలంలోని నారేపల్లి గ్రామానికి చెందిన గజ్జి ప్రశాంత్ కుమార్ కనిపించడం లేదని తండ్రి క్రిష్టప్ప ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు కొత్తచెరువు పీఎస్ సీఐ మారుతీ శంకర్ తెలిపారు. వివరాలు... పల్నాడు జిల్లా మాచర్లలో బీటెక్ చదువుతున్న ప్రశాంత్‌కుమార్.. కొన్ని రోజులు క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఈ నెల 19న కళాశాలకు తిరుగు ప్రయాణమయ్యాడు. అయితే కళాశాలకు ప్రశాంత్ చేరుకోలేదని తెలుసుకున్న కుటుంబసభ్యులు గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### నలుగురు విద్యార్థుల అదృశ్యం



కనిపించకుండా పోయిన విద్యార్థులు

**అనంతపురం:** నగరంలోని మూడో రోడ్డులో ఉన్న బీసీ బాలుర హాస్టల్–2లో ఉంటూ ఒకటో రోడ్డులో ఉన్న పొట్టిశ్రీరాములు ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న నలుగురు విద్యార్థులు కనిపించకుండా పోయారు. వీరిలో పదో తరగతి చదువుతున్న నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామానికి చెందిన బాబు, కూడేరు మండలం అరవకూరు గ్రామానికి చెందిన జి.నవదీప్, 8వ తరగతి చదువుతున్న గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన ఎస్.మణికంఠ, తొమ్మిదో తరగతి చదువుతున్న శ్రీసత్యసాయి జిల్లా తోటమాకులపల్లి గ్రామానికి చెందిన కె.మణికంఠ ఉన్నారు. పాఠశాలకు సక్రమంగా హాజరు కాకపోవడంత పాటు.. పాఠ్యాంశాలల్లో వెనుకబడి ఉండడంతో గురువారం హెచ్ఎం శ్రీదేవి మందలించారు. దీంతో మధ్యాహ్నం పాఠశాల నుంచి బయటకు వెళ్లిపోయిన విద్యార్థులు ఆ తర్వాత హాస్టల్‌కు కూడా చేరలేదు. గమనించిన వార్డెన్ మస్తాన్ వెంటనే అప్రమత్తమై పాఠశాలలో ఆరా తీశాడు. మధ్యాహ్నం నుంచి వారు తరగతులకు హాజరు కాలేదని తెలుసుకుని వెంటనే చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చేపట్టాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో రాత్రి మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు సీఐ కె.శాంతిలాల్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94906 18679కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## మానవాళి మహోన్నేతాలు చిత్రం ఆవిష్కరణ



చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ధర్మవరం అర్బన్:** సమాజాభివృద్ధికి కొత్త బాటలు వేసిన 102 మంది ప్రపంచ మేధావులతో కూడిన చిత్రపటాన్ని ధర్మవరంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ.. సమాజాన్ని మేలుకొల్పేవారే నిజమైన వైతాళికులన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, మహాత్మాగాంధీ, విలియం షేక్‌స్పియర్, మదర్‌థెరిస్సా, ఆల్బర్ట్ నోబెల్, విన్స్టన్ చర్చిల్, నెపోలియన్, రవీంద్రనాథ్ ఠాగూర్, కారల్ మార్క్స్, కన్ఫ్యూషియస్, లెనిన్, పికాసో, కోఫీఅన్నన్ వంటి పేరు గాంచిన కవులు, రచయితలు, కళాకారులు, సంఘ సంస్కర్తలు, సామాజిక, శాస్త్ర సాంకేతిక, వైజ్ఞానిక, తత్వ రాజకీయ, క్రీడా, వ్యాపార, ఆర్థిక విద్యావేత్తలతో కూడిన 102 మంది మేధావుల చిత్రాలు ఆకట్టుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ చిట్టెమ్మ, అధ్యాపకులు త్రివేణి, షమీవుల్లా, పావని, హైమావతి, వెంకటలక్ష్మి, తాహిర్‌ఆలి, ఆనంద్, మీన, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## డి.చెర్లోపల్లిలో పర్యటించిన కేంద్ర బృందం



గ్రామ సచివాలయ పరిసరాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

**బత్తలపల్లి:** స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో భాగంగా కేంద్ర బృందం సభ్యులు గురువారం బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లిలో పర్యటించారు.ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మసీదు, గ్రామ సచివాలయం, చెత్తతో సంపద తయారీ కేంద్రంతో పాటు గ్రామంలోని గృహాలు, మరుగుదొడ్లను, నీటివసతి, పరిసరాలు పరిశుభ్రతను, మురుగునీటి నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యుడు బి.రామచంద్ర, జిల్లా ఎస్‌బీఎం కోఆర్డినేటర్లు వి.శ్రీనివాసులు, డి.సాయినాథ్‌బాబు, మండల అధికారులు ఎంపీడీఓ నరసింహనాయుడు, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతిబాయి, గ్రామ సర్పంచ్ గుజ్జల రమాదేవి, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి, ఎంసీఓ ఆదినారాయణరెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

- సీటీఐఓ లక్ష్మానాయక్

**అనంతపురం అగ్రికల్చర్:** ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాచురల్ ఫార్మింగ్ (ఎన్ఎఫ్) చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ (సీటీఐఓ) వి.లక్ష్మానాయక్ అన్నారు. స్థానిక జెడ్‌బీఎన్ఎఫ్ కార్యాలయంలో రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన డీపీఎంయూ సిబ్బందికి 8 రోజుల వర్క్‌షాపు గురువారం ప్రారంభమైంది. నేలలు, రకాలు, ఆగ్రో క్లైమాటిక్ జోన్స్, జలవనరులు, ప్రాజెక్టులు, రైతుల అవసరాలు, ప్రకృతి వ్యవసాయ ఆవిష్కరణలు, ఏటీఎం, ఏ–గ్రేడు, పీఎండీఎస్, డాక్టర్ పీఎం, రుతుపవనాలు, వర్షపాతం, తేమశాతం, నేలల్లో తేమ సంరక్షణా విధానం, మానవులు, పశువుల మధ్య వ్యవసాయ సంబంధాలు తదితర అంశాలపై ఈనెల 24 వరకు వర్క్‌షాపు ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా లక్ష్మానాయక్ మాట్లాడారు. సాధ్యమైనంత ఎక్కువ మంది రైతులను ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సహించాలన్నారు. విచ్చలవిడి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం వల్ల అధిక పెట్టుబడులు, తగ్గుతున్న దిగుబడులు కారణంగా రైతులకు వ్యవసాయం భారమవుతున్న తరుణంలో ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించడమే శరణ్యమన్నారు. ఏడాది పొడవునా పంటలు పండించే పద్ధతులు తెలియజేయాలన్నారు.

## ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలి



రెస్టారెంట్‌లో ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు

**పుట్టపర్తి టౌన్:** రెస్టారెంట్లు, హోటళ్లలో యజమానులు ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రామచంద్రయ్య సూచించారు. గురువారం పుట్టపర్తి మున్సిపాలిటీలో రెస్టారెంట్లు, హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను మున్సిపాలిటీ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోటళ్ల, రెస్టారెంట్ల యమానులు పరిశభ్రత పాటిస్తూ తిను బండారాలపై దృష్టి సారించాలన్నారు. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకు దేశ విదేశాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పుట్టపర్తి విచ్చేయనున్నారని, వారికి ఇబ్బంది కలగకుండా సరసమై ధరలతో,నాణ్యమైన భోజనం అందించాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు.

### అప్పు చెల్లించలేదని వ్యక్తిపై దాడి

**ధర్మవరం అర్బన్:** అప్పు చెల్లించలేదంటూ వ్యక్తిపై వడ్డీ వ్యాపారులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరంలోని లక్ష్మీచెన్నకేశపురానికి చెందిన మేడాపురం రామయ్యతో శాంతినగర్‌కు చెందిన బసిరెడ్డి గారి ఆనందరెడ్డి రూ.2.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఇందుకు గాను రూ.10 చొప్పున వడ్డీ చెల్లించేలా రామయ్య ఒప్పందం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 17న కదిరి గేటు సమీపంలో వెళుతున్న ఆనందరెడ్డిని రామయ్య, అతని కుమారులు ప్రదీప్, మంజు అడ్డుకుని అప్పటికప్పుడు అసలు, వడ్డీ చెల్లించాలంటూ ఒత్తిడి చేశారు. సర్దిచెప్పే ప్రయత్నం చేసిన ఆనందరెడ్డిపై దాడి చేసి గాయపరిచారు. ఘటనపై బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

### దంపతులపై వడ్డీ వ్యాపారి దాడి

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన దేవరశెట్టి భారతి, రమణపై వడ్డీ వ్యాపారి దాడి చేశాడు. ఈ మేరకు ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శాంతినగర్‌కు చెందిన పట్టుచీరల వ్యాపారి రమణ, ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా వెళుతున్న భార్య భారతి... యర్రగుంటకు చెందిన రాజాతో రూ.6లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఇందుకు రూ.10 చొప్పున వడ్డీని రాజా వసూలు చేసుకుంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మూడు నెలలుగా వడ్డీ చెల్లించలేక ఇబ్బంది పడుతున్న దంపతులపై బుధవారం సాయంత్రం రాజా, ఆయన అనుచరులు బెదిరింపులకు దిగి దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## వైభవం.. సత్యసాయి ప్రేమవాహిని రథోత్సవం



పెనుకొండలో సాగుతున్న సత్యసాయి రథోత్సవం

**పెనుకొండ/రొద్దం:** బాబా శతజయంత్యుత్సవాల్లో భాగంగా విశ్వశాంతి కోసం దేశ వ్యాప్తంగా పర్యటిస్తున్న సత్యసాయి ప్రేమవాహిని రథం గురువారం పెనుకొండ పట్టణంతో పాటు రొద్దం గ్రామానికి చేరుకుంది. రథోత్సవం అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.



రొద్దంలో రథోత్సవంలో పాల్గొన్న మహిళలు